
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
సోమవారం 3 నవంబరు 2025



## అంతర్ రాష్ట్ర దొంగల ముఠా దొరికింది



### ద్వారకాతిరుమలలో ఒకే రోజు మూడు ఇళ్లల్లో చోరీలు



## కొండెక్కిన కూరగాయలు

### ఏది కొందామన్నా రూ.60 పైనే..

7

## కన్నుల పండువగా జలవిహారం

క్షీరాబ్ది ద్వాదశి పురస్కరించుకుని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్నుల పండువగా తెప్పోత్సవాలు నిర్వహించారు. ఆచంటలో సాయంత్రం రామగుండం చెరువులో ఆచంటేశ్వరుని సన్నిధిలోని సత్యనారాయణస్వామి, మదన గోపాలస్వామిల జలవిహారం కన్నుల పండువగా జరిగింది. రెండు పడవల్లో తెప్పోత్సవం నిర్వహించారు.





పేరుపాలెం సాగర తీరాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్ రాజ్‌కిషోర్

# బీచ్‌కు రావొద్దు

### సందర్శకులకు ఆర్డీవో సూచన

మొగల్తూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు మండలం కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌ను ఆర్డీవో దాసి రాజు ఆదివారం సందర్శించారు. కార్తీక మాసం సందర్భంగా బీచ్‌కు పెద్ద ఎత్తున సందర్శకులు తరలివచ్చే అవకాశం ఉందని అయితే మొంథా తుఫాన్ కారణంగా సముద్ర అలలను దృష్టిలో పెట్టుకుని తీరానికి సందర్శకులను అనుమతించడం లేదన్నారు. తుఫాన్ తీరం దాటినప్పటికీ వాతావరణం సానుకూలంగా లేదని వాతావరణశాఖ నుంచి తదుపరి ఆదేశాలు వచ్చేవరకూ సందర్శకులకు అనుమతి లేదన్నారు. అప్పటి వరకూ పోలీస్ బందోబస్త్ ఉంటుందన్నారు. తహసీల్దార్ కె.రాజ్‌కిషోర్, వీఆర్వో నిరంజన్ తదితరులున్నారు. అనంతరం కేపీ పాలెంలో తుఫాన్ బాధితులకు రేషన్ షాపుల వద్ద అందిస్తున్న నిత్యావసర సరుకుల పంపిణీని పరిశీలించారు.

# బాబోయ్.. ఆయనా !

### నరసాపురానికి కొత్త కమిషనర్ ?
### ఆయనైతే వద్దంటూ నేతల వద్ద మొర
### ఆర్డర్ రాకుండానే జోరుగా చర్చ



నరసాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నరసాపురం మునిసిపల్ కమిషనర్ అంజయ్య బదిలీ అవుతున్నారంటూ రెండు రోజులుగా పురపాలకంలో జోరుగా చర్చ సాగుతోంది. ఆయన స్థానంలో గతంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉన్న ఓ పురపాలక సంఘంలో ప్రస్తుతం పనిచేస్తున్న ఓ అధికారి ఇక్కడికి వస్తున్నారంటూ ఊహగానాలు ఊపందుకున్నాయి. ఇప్పటికే ఆయనకు ఆర్డర్ పడిందని, లేదు లెటర్ మాత్రమే తీసుకున్నారని, ఇంకా ప్రభుత్వం నుంచి ఆర్డర్ రాలేదని చర్చ కూడా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఆ అధికారి పనితీరు గురించి విచారించిన మునిసిపల్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు బాబోయ్ వద్దంటూ కూటమి నేతల వద్ద మొరపెట్టుకున్నారు. మరో రెండేళ్లలో పదవీ విరమణ అయ్యే ఆ అధికారిని తెచ్చుకుని పుష్కరాలకు ముందుకు సాగలేమని నేతల వద్ద వాపోతున్నారు. దీంతో ఆ కమిషనర్ ఇక్కడికి వస్తారా..? లేక మరో కమిషనర్‌ను తెచ్చుకుంటారా అన్న చర్చ జోరుగా సాగుతోంది. ప్రస్తుతం అంజయ్య కమిషనర్‌గా పని చేస్తున్నారు. ఆయన బాధ్యతలు చేపట్టి 14 నెలలు అయింది. ఆయన పనితీరుపై కౌన్సిల్‌తో పాటు కొంత మంది అధికారులు కూడా అసంతృప్తితో ఉన్నారు. కొంత మంది కూటమి నాయకుల్లో కూడా ఇదే భావన ఉంది. పుష్కరాలు వస్తున్న నేపథ్యంలో సమర్ధవంతమైన అధికారిని తీసుకురావాలని యోచిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కూటమి నేతలు తీసుకురావాలని యోచిస్తున్న కమిషనర్‌కు ఇక్కడ పోస్టింగ్ పడుతుందా? లేదా అన్న వేచి చూడాల్సి ఉంది.




# ఈ సారైనా వస్తారా..?

### ఏపీ నిట్ డైరెక్టర్ కోసం అక్టోబరు 30న ఇంటర్వ్యూలు నిర్వహించిన కమిటీ
### రాష్ట్రపతి పరిశీలనకు ముగ్గురి పేర్లు

**(భీమవరం-ఆంధ్రజ్యోతి) :** తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌కు డైరెక్టర్ నియామకంపై కేంద్రం కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీ అక్టోబరు 30న ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఏపీ నిట్ డైరెక్టర్ కోసం 85 మంది ప్రొఫెసర్‌లు దరఖాస్తు చేసుకున్నారు. దేశంలోని ఐఐటీ, నిట్‌లలో పనిచేస్తున్న వారు దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. ఇంటర్వ్యూలు పూర్తి కావడంతో అందులో ముగ్గురిని ఎంపిక చేసి కేంద్ర విద్యాశాఖకు కమిటీ నివేదిక పంపనుంది. అదే నివేదికను రాష్ట్రపతికి పంపనున్నారు. అందులో ఒకరిని రాష్ట్రపతి నియమిస్తారు. మూడేళ్లుగా ఏపీ నిట్ డైరెక్టర్ పదవి ఖాళీగా ఉంది.. ఇన్‌చార్జిలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఏపీ నిట్‌లో కేంద్రం మంజూరు చేసిన బోధన, బోధనేతర సిబ్బందిని భర్తీ చేయలేక పోతున్నారు. మరోవైపు ఏపీ నిట్ అభివృద్ధి కోసం రూ.400 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. వాటికి కూడా మోక్షం లభించడం లేదు. రెగ్యులర్ డైరెక్టర్ వస్తేనే ఇటువంటి సమస్యలు పరిష్కారం కానున్నాయి. ఫ్యాకల్టీ తక్కువగా ఉందని, సరిపడా వసతి సౌకర్యం లేదంటూ సీట్ల సంఖ్యను 750 నుంచి 480కి కుదించారు. విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ కల్పించడానికి మంచి కంపెనీలు రావాలంటే డైరెక్టర్ ఉండాలి. డైరెక్టర్ పదవి కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావహులకు ఇంటర్వ్యూలు పూర్తి కావడంతో రాష్ట్రపతి నిర్ణయం కోసం అంతా ఎదురు చూస్తున్నారు.

# కొనుగోళ్లకు రెడీ



### జిల్లాలో 5 లక్షల టన్నుల లక్ష్యం
### వాతావరణం ప్రశాంతం
### మాసూళ్లకు సిద్ధమవుతున్న రైతులు
### 48 గంటల వ్యవధిలోనే సొమ్ములు జమ

## నేటి నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**(భీమవరం-ఆంధ్రజ్యోతి)**

ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లా నుంచి ఐదు లక్షల టన్నుల ధాన్యాన్ని జిల్లా నుంచి సేకరించేలా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. తాడేపల్లిగూడెం రూరల్ మండలం ఆరుగొలనులో పౌరసరఫరాల మంత్రి నాదేండ్ల మనోహర్ సోమవారం తొలి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. జిల్లాలో 252 కేంద్రాలు ద్వారా ఖరీఫ్ ధాన్యం సేకరి స్తారు. కేవలం 48 గంటల్లోనే రైతు ఖాతాల్లో సొమ్మును జమ చేయనున్నారు. ప్రభుత్వం నిధులను సిద్ధం చేసింది. మొంథా తుఫాను నుంచి రైతులు గట్టెక్కారు. నష్టం తక్కువగా ఉండడంతో రైతులు కాస్త ఊరట పొందారు. ఖరీఫ్ మసూళ్లకు సిద్ధమవుతున్నారు. నవంబరు 15 నుంచి జిల్లాలో మాసూళ్లు ముమ్మరం కానున్నాయి. వాతావరణం ప్రస్తుతం సహకరిస్తోంది. ఎండ వాతావరణం నెలకొంది. కొన్ని రోజులపాటు ఇదే తరహాలో సహకరిస్తే రైతులు ధాన్యం విక్రయించడానికి ఎటువంటి ఆటంకాలు ఉండవు. జిల్లాలో ప్రస్తుతానికి 1.20 కోట్ల సంచులను కూడా సిద్ధం చేశారు. మిల్లులకు లక్ష్యాలను కేటాయించారు. మరాడించిన తర్వాత మిల్లర్ల నుంచి బియ్యాన్ని త్వరతగతిన సేకరించే కార్యాచరణను కూడా రూపొందించారు. గడచిన రబీలో కొద్దిపాటి సొమ్ములను రైతులకు ఇవ్వడంలో జాప్యం జరిగింది. ఇప్పుడు అటువంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం సర్వసన్నద్ధంగా ఉంది. రైతుల నుంచి ప్రతి గింజ కొనుగోలు చేయాలని సంకల్పించింది. అక్టోబరులోనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించారు. మొంథా తుఫాను ప్రభావంతో వాయిదా వేసుకున్నారు. వాతావరణమంతా ఇప్పుడు రైతులకు అనుకూలంగా ఉంది. దాంతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. భారత ఆహార సంస్థకు ఖరీఫ్ బియ్యాన్ని అప్పగించనున్నారు. దానివల్ల గోదాముల సమస్య కూడా తలెత్తదు. తేమ శాతం సమస్యను అధిగమించేలా కొనుగోలు కేంద్రాల్లోనూ, మిల్లర్ల వద్ద ఒకే రకమైన ఉపకరణాలను సిద్ధం చేశారు. రెండింటి మధ్య తేడా వేస్తే తహసీల్దార్‌తో కూడిన కమిటీ పరిశీలించనుంది. అంతిమ నిర్ణయం కమిటీదే. ఇలా తేమ సమస్యను అధిగమించేలా ప్రభుత్వం పరిష్కారం చూపింది. రైతులు ఆరుదల ధాన్యం అప్పగిస్తే పూర్తి స్థాయిలో మద్దతు ధర లభించనుంది.

## నేడు మంత్రి నాదెండ్ల పర్యటన

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల కార్యక్రమాల్లో పాల్గొనున్నట్టు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయం నుంచి ఆదివారం తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు తాడేపల్లిగూడెం హౌసింగ్‌బోర్డు రైతుబజార్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం చాక్లెట్ ఫ్యాక్టరీ యూనిట్ ప్రారంభించనున్నారు. ఆరుగొలనులో డొక్కా సీతమ్మ విగ్రహ ఆవిష్కరణ, ప్రత్తిపాడు నుంచి కొత్తూరు వరకూ రూ.2.97 కోట్ల విలువ గల రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనున్నట్టు తెలిపారు.

# జాబితా సిద్ధం

### జిల్లాలో 20 మండలాల్లో
### 8,043 హెక్టార్లలో పంట నష్టం
### నష్టపోయిన రైతులు 17,594
### నివేదిక సమర్పించిన అధికారులు



ఉండి మండలం వాండ్రంలో పడిపోయిన చేలు

భీమవరం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మొంథా తీవ్ర తుఫాన్ కారణంగా పంట నష్టం జాబితాలను అధికారులు సిద్ధం చేశారు. ముంపు నీరు తగ్గన తర్వాత వరిచేలను ప్రాంతాల వారీగా పరిశీలించారు. జిల్లాలోని 20 మండలాల్లోని 17,594 రైతులకు సంబంధించిన 8,043 హెకార్లలో తుఫాన్ వల్ల నష్టం చేకూరిందని జిల్లా వ్యవసాయ అధికారులు గుర్తించారు. వివరాలను ప్రభుత్వానికి పంపించారు. తుఫాన్ సమయంలో 10,500 హెక్టార్లలో వరిచేలు పడిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో ముంపు నీరు తగ్గడం వల్ల దాదాపుగా 2,500 హెక్టార్లలో వరిచేలు బయటపడ్డాయి. తుఫాన్ ఉధృతిని బట్టి భారీ నష్టం ఉంటుందని రైతులు ఆందోళన చెందారు. మిగిలిన జిల్లాలతో పోలిస్తే వర్షపాతం బాగా తక్కువ నమోదు కావడం, వరిసాగు దెబ్బతినకుండా గట్టెక్కడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. తుఫాన్ వెళ్ళిన తర్వాత పంట కాలువలలోకి నీరు నిలిపివేశారు. చేలో ఉన్న వర్షపునీరు బయటకు వెళ్లేందుకు పంట కాలువలలోకి నీరు వదిలారు. నీరు తగ్గిన తర్వాత పడినచేలును కట్టలుగా కట్టడానికి, తెగుళ్ళ నివారణ చర్యలకు పురుగు మందులు పిచికారీ చేయడానికి వీలుగా ఉంటుంది.ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకుంటున్నారు.

**మండలాల వారీగా నష్టం వివరాలు**

| మండలం | రైతులు | పంటనష్టం (హెక్టార్లలో) |
|---|---|---|
| యలమంచిలి | 544 | 191 |
| గణపవరం | 619 | 245 |
| అత్తిలి | 716 | 235 |
| పెనుమంట్ర | 736 | 341 |
| తణుకు | 1404 | 619 |
| పోడూరు | 562 | 245 |
| పెంటపాడు | 2101 | 1031 |
| ఆచంట | 383 | 157 |
| నర్సాపురం | 2040 | 942 |
| ఆకివీడు | 920 | 464 |
| పాలకోడేరు | 501 | 276 |
| భీమవరం | 1445 | 838 |
| ఇరగవరం | 843 | 382 |
| తాడేపల్లిగూడెం | 1463 | 638 |
| కాళ్ళ | 741 | 349 |
| మొగల్తూరు | 353 | 126 |
| వీరవాసరం | 810 | 413 |
| పాలకొల్లు | 792 | 280 |
| ఉండి | 313 | 149 |
| పెనుగొండ | 308 | 123 |
| మొత్తం | 17,594 | 8,043 |

# ఆ..ఇళ్ల సంగతేంటి ?

### ప్రధానమంత్రి ఆవాస్‌లో కేటగిరీ-3 ఇళ్లపై ఆరా
### జిల్లాలో 6,843 ఇళ్ల పరిస్థితిపై సర్వే
### యాప్ ద్వారా నమోదు చేస్తున్న గృహ నిర్మాణ శాఖ అధికారులు



భీమవరం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకంలో 3 కేటగిరీ ఇళ్ల నిర్మాణానికి కుస్తీ పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లకు అప్పగించారు. పెట్టుబడి అధికం అవుతుండంతో ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇచ్చేలా కొంతమంది లబ్ధిదారులు కేటగిరీ-3 ఆప్షన్ ఎంపిక చేసుకున్నారు. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురంలో కేటగిరీ-3 లబ్ధిదారులు ఎక్కువగా ఉన్నారు. ఒక్క భీమవరంలోనే కాంట్రాక్టర్ ఇళ్ళు నిర్మిస్తున్నారు. విడతల వారీగా పూర్తి చెయ్యటానికి కసరత్తు చేస్తున్నారు. మిగిలిన పట్టణాల్లో కాంట్రాక్టర్లు చేతులు ఏత్తేశారు. మూడో కేటగిరీలో నిర్మించిన ఇళ్లకు కొన్ని నెలలుగా బిల్లులు మంజూరు కావటం లేదు. దీనిపై అసెంబ్లీలో చర్చసాగింది. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఇళ్ళ పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం దిశా నిర్దేశం చేసింది.తరువాతే బిల్లు మంజూరు చెయ్యనుంది. దీంతోటే సర్వేలో అధికారులు నిమగ్నమయ్యారు. కేటగిరి-3లో కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న ఇళ్లకు రూ.1.80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుంది. మహిళలకు బ్యాంకుల నుంచి మరో రూ.35 వేలు రుణం రూపంలో మంజూరు చేస్తున్నారు. ఇలా ఒక్కో ఇంటికి రూ.2.15 లక్షలు సమకూరుతోంది. ఇంటి నిర్మాణానికి ఈ నిధులు సరిపోవడం లేదు. లబ్ధిదారులు కొంత పెట్టుబడిగా కాంట్రాక్టర్‌కు ఇస్తున్నారు. ఫలితంగా భీమవరం వంటి ప్రాంతంలోనే 3వ కేటగిరి ఇళ్ళు కొంతమేర ముందుకు వెళ్తున్నారు. నరసాపురంలో కాంట్రాక్టర్ పూర్తిగా చేతులు ఎత్తేశారు. ముగ్గురు కాంట్రాక్టర్లపై కేసులు నమోదుకు అధికారులు సిద్ధం అయ్యారు. ఐనా స్పందన అంతంతమాత్రంగానే ఉంది. లోతట్టు ప్రాంతాల్లో స్థలాలు కేటాయించటం వల్ల సమస్య ఏర్పడింది. ఇంటి నిర్మాణానికి పెట్టుబడి అధికం అవుతోంది. లబ్ధిదారులు సొంతంగా ఇళ్ళు నిర్మించుకోవాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అవి కూడా పూర్తి కావడం లేదు. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయంటూ కొంతమంది కాంట్రాక్టర్లు ముఖం చాటేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని కోరింది. ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు.

### పరిశీలనలో 6,843 ఇళ్లు

కేటగిరీ-3కు సంబంధించి 6,843 ఇళ్ళు సర్వేచేసి నివేదిక ఇవ్వాలని గృహ నిర్మాణ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. అంతే కాకుండా ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ఆ యాప్‌లో గృహ నిర్మాణ శాఖ ఏఈ పరిశీలన చేసి ఫోటో తీసి వాస్తవ పరిస్థితిని నమోదు చేస్తారు. దీంతో పాటుగా డీఈఈ, తరువాత డీవీహెచ్, చివరగా పీడీ కూడా పరిశీలించి నమోదు చెయ్యవలసి ఉంటుంది. ప్రస్తుతం సర్వే కొనసాగుతోంది.



# చేప పిల్లలకు డిమాండ్

### చేపల సాగు వైపు రొయ్య రైతులు

కలిదిండి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వనామి రొయ్య నుంచి చేపల సాగువైపు ఆక్వా రైతులు మక్కువ చూపుతుండడంతో చేప పిల్లలకు డిమాండ్ పెరిగింది. రొయ్యల సాగులో నష్టాల రావడంతో చాలామంది రైతులు ప్రస్తుతం వాణిజ్యపరంగా ఎక్కువ డిమాండ్ ఉన్న శీలావతి, బొచ్చె, ఫంగస్ వంటి రకాల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు కారణంగా వనామి రొయ్యలకు వైరస్ సోకడంతో పాటు ఆక్సిజన్ కొరత ఏర్పడి వేలాది ఎకరాల్లో రొయ్యలు మృత్యువాత పడి లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లింది. దీంతో నికర ఆదాయం లభించే చేపల సాగు మేలని రైతులు భావిస్తున్నారు. చేపల సీడ్ హేచరీలు మన ప్రాంతంలో పరిమితంగా ఉన్నాయి. ఇక్కడ రైతు లకు అవసరమైన సీడ్ చెన్నై, నెల్లూరు, కాకినాడ, ప్రకాశం జిల్లాల నుంచి తీసుకొస్తారు. ప్రస్తుతం శీలావతి చేపపిల్ల అంగుళం సైజు రూ.1.50 పైసలు పలుకుతోంది. ఇంకా పెద్ద సైజు ఉంటే రూ.2 నుంచి రూ.5 ధర ఉంది. ప్రస్తుత చేపల చెరువుల్లో జీరో పాయింట్ చేప పిల్లలను రైతులు ఎక్కువగా వేస్తున్నారు. పావు కిలో ఉన్న చేప పిల్లను జీరో పాయింట్‌గా పిలుస్తారు. కిలోల చొప్పున వీటిని విక్రయిస్తారు. జీరో పాయింట్ చేపపిల్ల రూ.12 చొప్పున విక్రయిస్తున్నారు.

# క్యాట్ ఫైనల్ ప్రిపరేషన్

# వేగం, కచ్చితత్వం ప్రధానం

ఐఐఎం సహా పేరొందిన మేనేజ్‌మెంట్ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్ష క్యాట్(కామన్ అడ్మిషన్ టెస్ట్). ఈ టెస్ట్‌లో సాధించిన పర్సంటైల్‌తో నేరుగా ప్రవేశం లభించదు. అయితే ఆ కాలేజీలు అడ్మిషన్‌కు సంబంధించి పరిగణనలోకి తీసుకునే ప్రాతిపదికల్లో మొదటిది మాత్రం క్యాట్ పర్సంటైల్. తొలిసారి ఈ టెస్ట్ రాసే అభ్యర్థులు ఒకవైపు ఫైనలియర్‌లో చివరి అంకమైన ప్రాజెక్ట్ వర్క్ పనిలో ఉంటారు. మరోపక్క గేట్, క్యాట్ వంటి ప్రవేశ పరీక్షలు, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ టెస్టుల బిజీలోనూ ఉంటారు. వీటిలో క్యాట్‌కు పట్టుమని నెల రోజుల గడువు కూడా లేదు. ఈ నేపథ్యంలో క్యాట్ తొలిసారి రాస్తున్నవారికి తోడు ఒకింత అవగాహనతో ముందుకు సాగుతున్న వారి వరకు అభ్యర్థులంతా టెస్ట్‌కు సమర్థంగా సన్నద్ధం కావచ్చు. అందుకు ప్రధానంగా.. క్యాట్‌లో అడిగిన అన్ని ప్రశ్నలూ సాల్వ్ చేయాల్సిన అవసరం లేదు. 40 నుంచి 50 శాతం ప్రశ్నలను సాల్వ్ చేయగలిగితే చాలు, మంచి స్కోర్ సాధించవచ్చన్నది నిపుణుల సూచన. క్యాట్‌లో ప్రధానంగా మూడు విభాగాలు - వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ), డేటా ఇంట్రప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఎల్ఆర్), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(క్యూఎ) ఉంటాయి. ఒక్కో విభాగానికి సంబంధించి ప్రిపరేషన్ ఇలా ఉండేలా చూసుకోవాలి.



### క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (క్యూఎ)

- ఈ విభాగంలో వేగం అంతకు మించి కచ్చితత్వం ప్రధానం. ఆ రెంటికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా మంచి స్కోర్ సాధించాలి.
- అర్థమెటిక్, ఆల్జీబ్రా, జామెట్రీ, మోడ్రన్ మేథ్స్‌లోని కాన్సెప్ట్‌లను రివైజ్‌చేసుకోవాలి. కాన్సెప్ట్‌లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి.
- ఈ విభాగం సెక్షనల్ మాక్ టెస్టులను వారానికి రెండు లేదా మూడు చొప్పున చేయాలి.
- అన్ని టాపిక్స్‌లో కలిపి ప్రతి రోజూ 30 నుంచి 40 ప్రశ్నలను సాల్వ్ చేయాలి.
- త్వరితగతిని గుర్తుకు తెచ్చుకునేందుకు వీలుగా ఫార్ములా నోట్ బుక్‌ను మెయింటైన్ చేయాలి.
- గతం నిర్వహించిన ప్రశ్నపత్రాల్లో తరచూ అడుగుతున్న ప్రశ్నలను పదేపదే సాల్వ్ చేస్తుండాలి.

### డేటా ఇంట్రప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఎల్ఆర్)

- రోజుకు కనీసం రెండు, మూడు సెక్షనల్ మాక్ టెస్టులను చేయాలి. ప్రతి సారి సాల్వ్ చేయడంలో కష్ట స్థాయిని పెంచుకుంటూ వెళ్లాలి.
- డేటా టేబుల్స్, లాజికల్ పజిల్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- ప్రతి సెట్‌కు టైమ్ సెట్ చేసుకోవాలి. అలా సాల్వింగ్ కోసం పట్టే సమాయాన్ని తగ్గించుకోవాలి.
- ప్రతి మాక్ టెస్టులో దొర్లే తప్పులను విశ్లేషించుకోవాలి. సాల్వింగ్ నుంచి ఆలోచన, తుది నిర్ణయం వరకు ప్రతి చోట సాధారణంగా ఎదురవుతున్న తప్పులను ఒక దగ్గర నోట్ చేసుకోవాలి. అవి పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- చివరి వారానికల్లా పది, పదిహేను నిమిషాల్లో ప్రతి సెట్‌ను పూర్తి చేయగలగడం అన్నది లక్ష్యంగా పెట్టుకోవాలి. అదే సమయం 80 నుంచి 90 శాతం మేర కచ్చితత్వాన్నీ సాధించాలి.

### వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ)

- రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజ్‌లను చదవడంలో సరైన పాటవానికి తోడు నిలకడ సాధించాలి.
- రోజుకు కనీసం మూడు రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజ్‌లను చదవడాన్ని అలవాటు చేసుకోవాలి.
- పారా జంబుల్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- మాక్ టెస్టుల్లో అటు ఆ పరీక్ష, ఇటు వ్యక్తిగత ప్రతిభను సునిశితంగా విశ్లేషించుకోవాలి.

# రైల్వేలో మెగా రిక్రూట్‌మెంట్

భారతీయ రైల్వే వివిధ పోస్టులకు వేర్వేరుగా నోటిఫికేషన్లు విడుదల చేసింది. టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాలు ఉన్నాయి. వివిధ అర్హతలకు తోడు నిర్దేశిత ఎంపిక ప్రకియ ఆధారంగా ఈ పోస్టులను భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. సంక్షిప్తంగా ఆ వివరాలు దిగువ ఇస్తున్నాం.



### నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (అండర్ గ్రాడ్యుయేట్)

ఖాళీలు 3058

- కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్: 2424
- అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్: 394
- జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: 163
- ట్రైనీ క్లర్క్: 77

**అర్హత:** ఇంటర్ ఉత్తీర్ణత
**ఎంపిక:** కంప్యూటర్ ఆధారిత టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
**దరఖాస్తుకు ఆఖరు తేదీ:** నవంబర్ 27

### నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (గ్రాడ్యుయేట్)

ఖాళీలు 5810

- కమర్షియల్ కమ్ టికెట్ సూపర్వైజర్: 161
- స్టేషన్ మాస్టర్: 615
- గూడ్స్ రైలు మేనేజర్: 3416
- జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్: 921
- సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: 638
- ట్రాఫిక్ అసిస్టెంట్: 59

**అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణత. జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులకు ఇంగ్లీష్/హిందీ టైపింగ్‌లో ప్రావీణ్యం ఉండాలి.
**ఎంపిక:** కంప్యూటర్ ఆధారిత టెస్ట్(టైర్ 1, టైర్ 2)కు తోడు టైపింగ్ స్కిల్‌టెస్ట్/కంప్యూటర్ ఆధారిత ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
**దరఖాస్తుకు ఆఖరు తేదీ:** నవంబర్ 20

### ఇంకొన్ని

ఖాళీలు 2569

జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, మెటలర్జికల్ అసిస్టెంట్ పోస్టులకూ నోటిఫికేషన్ విడుదలైంది.
**అర్హత:** పోస్టును బట్టి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా/ బీఎస్సీ డిగ్రీ పాసై ఉండాలి.
**ఎంపిక:** రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, రైల్వే మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది.
**దరఖాస్తుకు ఆఖరు తేదీ:** నవంబర్ 20

# డిజైనింగ్ @ ఎన్ఐడి



దుస్తులు, పాదరక్షలు, వాచీ, హ్యాండ్‌బ్యాగ్ సహా ఏదైనా సరే, ఒక వస్తువుకు ఉండాల్సిన సాధారణ లక్షణాలు దెబ్బతినకుండా అందంగా, ఆధునికంగా మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దడాన్నే డిజైనింగ్ అంటాం. ఈ అంశానికి సంబంధించి మన దేశంలో అత్యున్నత శిక్షణ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి) అహ్మదాబాద్. దానికితోడు గాంధీనగర్‌లో పీజీ క్యాంపస్, బెంగళూరులో ఆర్ అండ్ డి క్యాంపస్ ఏర్పాటు చేశారు. తరవాతి రోజుల్లో విజయవాడ (ఆంధ్రప్రదేశ్), కురుక్షేత్ర(హర్యానా), భోపాల్(మధ్యప్రదేశ్), జోర్హాట్(రాజస్థాన్)లలో కూడా ఎన్ఐడి దేనికదిగా ఏర్పాటై గ్రాడ్యుయేట్ కోర్సును ఆఫర్ చేస్తున్నాయి. వీటన్నింటికి కలిపి అడ్మిషన్లకు ప్రకటన విడుదలైంది.

కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి). డిజైన్ ఎడ్యుకేషన్, సంబంధిత పరిశోధనలో గ్లోబల్ లీడర్‌గా అవతరించాలన్నది ఎన్ఐడి లక్ష్యం. విభిన్న డొమైన్లు ఇక్కడ ఉన్నాయి. కోర్సు పూర్తయ్యేనాటికి సంబంధిత పరిశ్రమలో ఇమిడిపోయే వ్యక్తిగా విద్యార్థిని తీర్చిదిద్దుతారు.

**బీ డిజైన్ సీట్లు:** అహ్మదాబాద్ క్యాంపస్‌లో 128 సీట్లు; ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో ఒక్కో దానిలో 75 సీట్లు ఉన్నాయి.

**అర్హత:** అభ్యర్థులు 2005 జూలై 1న లేదా ఆ తరవాత జన్మించి ఉండాలి. గుర్తింపు పొందిన బోర్డుల నుంచి 2025-26 విద్యాసంవత్సరంలో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.

**డీఏటీ వివరాలు:** ప్రిలిమ్స్‌ను పేపర్ - పెన్సిల్/పెన్ విధానంలో నిర్వహిస్తారు. టెక్స్ట్, విజువల్స్ అంశాల నుంచి ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో అడుగుతారు. పరీక్ష వ్యవధి వివరాలను అడ్మిట్‌కార్డ్‌లో తెలియజేస్తారు.

**ఎం డిజైన్**
ఎన్ఐడి, అహ్మదాబాద్ క్యాంపస్ గాంధీనగర్‌లో పీజీ క్యాంపస్, బెంగళూరులో ఆర్ అండ్ డి క్యాంపస్‌లో మాత్రమే ఎం డిజైన్ కోర్సును అందిస్తున్నారు. మొత్తం 14 డిసిప్లిన్లలో దీనిని అందిస్తున్నారు. వివరాలకు సంబంధిత బ్రోచర్ చూడవచ్చు.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు రూ.3,000; మహిళలు రూ.2000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500, దివ్యాంగులు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబర్ 1
- **డీఏటీ ప్రిలిమ్స్ తేదీ:** డిసెంబర్ 21
- **ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** admissions.nid.edu

SCHOLARSHIP ALERT

## Colgate Keep India Smiling Scholarship 2025-26

***Description:*** An initiative of Colgate-Palmolive (India) Limited to provide financial assistance and support to individuals who are deserving and meritorious but may lack the resources to pursue their dreams.

***Eligibility:*** Indian students who are currently enrolled in Bachelor of Dental Surgery (BDS) (any year) or Master of Dental Surgery (MDS) courses in a recognised government or private institute. Applicants must have scored at least 65% marks in Class 12. Students must have an overall score of above 60% in their BDS to apply for the MDS scholarship. The annual family income of the applicants from all sources must not exceed INR 8 lakh.

***Prizes & Rewards:*** Scholarship of INR 75,000

***Last Date to Apply:*** 09-11-2025

***Application mode:*** Online applications only

***Short Url:*** www.b4s.in/aj/CKISSP7

buddy4study.com

# చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



## దెయ్యాల్ని వేటాడే వ్యక్తిగా కనిపిస్తాను

సుధీర్‌బాబు

"'జటాధర' చిత్రంలో నేను పోషించిన పాత్రను తెలుగులో ఇప్పటివరకూ ఎవ్వరూ చేయలేదు. నా సినిమా హిట్ అయితే అది నా కష్టంగా భావిస్తా. ఫ్లాప్ అయితే నా ఓటమిగా స్వీకరిస్తా' అని హీరో సుధీర్ బాబు అన్నారు. ఆయన కథానాయకుడిగా వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కించిన చిత్రం 'జటాధర'. సోనాక్షి సిన్హా హీరోయిన్. ఉమేశ్‌కుమార్ బన్సల్, శివిన్ నారంగ్ నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఇందులో దెయ్యాల్ని వేటాడే వ్యక్తిగా కనిపిస్తాను. సినిమా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. శివుడి నేపథ్యంలో వచ్చే సీక్వెన్స్‌కు గూస్‌బంప్స్ పక్కా' అని తెలిపారు. 'జటాధర' సినిమాలో సుధీర్‌బాబు నటన అద్భుతంగా ఉంటుంది' అని శివిన్ నారంగ్ చెప్పారు. 'నాకు తెలుగు చిత్ర పరిశ్రమ అంటే చాలా ఇష్టం. ఈ చిత్రం విషయంలో సహకారం అందించిన ప్రతీఒక్కరికీ కృతజ్ఞతలు' అని ప్రేరణ అరోరా పేర్కొన్నారు.

## స్టైలిష్ క్లైమాక్స్‌కు సిద్ధం



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. ఈ సినిమాను షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్‌మెంట్స్‌పై సాహుగారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి కీలక షెడ్యూల్ గురించి అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఆదివారం నుంచి చిరంజీవి, ఫైటర్స్ బృందంపై స్టైలిష్ క్లైమాక్స్‌ను షూట్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇది ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని, విజువల్‌గా అద్భుత అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రంలో కథానాయకుడు వెంకటేశ్ ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: తిమ్మరాజు, డీఓపీ: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

## 60వ వసంతంలోకి షారుక్



ఫరాఖాన్

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ తన 60వ పుట్టినరోజును ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముంబైలోని ఆయన నివాసం మన్నత్ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు, ఇతర సెలెబ్రిటీలతో కిక్కిరిసిపోయింది. ఫరాఖాన్, కరణ్ జోహార్, రాణీ ముఖర్జీ తదితరులు షారుక్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎప్పటి లాగే ఈసారి కూడా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది అభిమానులు షారుక్ నివాసానికి తరలి వచ్చారు.

### భయం కాదు.. విధ్వంసం

షారుక్ ఖాన్ కథానాయకుడిగా సిద్ధార్థ్ ఆనంద్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం షారుక్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ను ప్రకటించి, ఓ అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ముందునుంచి ప్రచారంలో ఉన్న 'కింగ్' అనే టైటిల్‌నే అధికారికంగా నిర్ణయించారు. 'నేనెంత మందిని చంపానో గుర్తులేదు. వారు మంచివాళ్లా, చెడ్డవాళ్లా అన్నది నేనెప్పుడూ అడగలేదు. వారి కళ్లల్లో భయం మాత్రమే నాకు గుర్తుంది', 'వెయ్యికి పైగా హత్యలు చేసి, వందలాది దేశాల్లో మోస్ట్ వాంటెడ్ అయిన నాకు ఈ ప్రపంచం ఇచ్చిన పేరు.. కింగ్, 'నేను భయం కాదు.. విధ్వంసం' అనే సంభాషణలు సినిమాపై అంచనాలను పెంచేశాయి. రెడ్ చిల్లీస్ ఎంటర్టైన్‌మెంట్స్, మార్‌ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. ఈ సినిమాలో సరికొత్త షారుక్‌ను చూస్తారని మేకర్స్ హామీ ఇచ్చారు.

## హైదరాబాద్‌లో భారీ ఈవెంట్



మహేశ్‌బాబు-రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న 'ఎస్ఎస్ఎంబీ29' చిత్రబృందం నుంచి అప్డేట్ వచ్చింది. ఈనెల 15న హైదరాబాద్‌లో గ్లోబ్ ట్రోట్టర్ పేరుతో ఒక భారీ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. అందులో సినిమా టైటిల్, గ్లింప్స్ వీడియోను ఆవిష్కరించనున్నారు. దీనికి సంబంధించిన ప్రోమోను ఉమెన్స్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఓ ఓటీటీ సంస్థ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నది. కాగా, సినిమా ప్రారంభమై రెండేళ్లు అవుతున్నా మేకర్స్ నుంచి అధికారికంగా ఒక్క అప్డేట్ కూడా రాలేదు. అయితే నవంబరులో అప్డేట్ ఇస్తామని గతంలో రాజమౌళి ఓ పోస్టు చేశారు. సినిమా టైటిల్‌తో పాటు మహేశ్‌బాబు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేస్తామని చెప్పడంతో అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే నవంబరు మొదలైనా ఎలాంటి అప్డేట్ రాలేదు. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబు 'నవంబరులో మీరు మాకు ఒక హామీ ఇచ్చారు. దయచేసి ఆ మాట నిలబెట్టుకోండి' అని ట్వీట్ చేశారు. దీంతో జక్కన్న కూడా 'సరే మహేశ్.. నవంబరు మొదలైంది ఇప్పుడే కదా.. మేము తప్పకుండా ఒక్కొక్కటిగా వెల్లడిస్తాం' అని సమాధానం ఇచ్చారు.

## పెళ్లి తర్వాత ప్రేమంటే?



ప్రియదర్శి, ఆనంది జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'ప్రేమంటే'. సుమ కనకాల కీలకపాత్ర పోషిస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బేనర్‌పై పుస్కూర్ రామ్ మోహన్‌రావు, జాన్వీ నారంగ్ నిర్మిస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. స్పిరిట్ మీడియా పతాకంపై రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. నవంబర్ 21న ఈ చిత్రం విడుదలవుతోంది. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. టైటిల్‌కు తగ్గట్లుగానే ప్రేమలో ఉన్నప్పుడు పెళ్లి తర్వాత జీవితం గురించి కనే కలలు, వాస్తవ జీవితంలోని చిన్న చిన్న సమస్యలతో ఎలా మారుతుందో చూపిస్తూ ఆద్యంతం వినోదంగా సాగిన టీజర్ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్‌రెడ్డి.

## మనం గర్వపడే సినిమా



రామ్ పోతినేని

రామ్ పోతినేని కథానాయకుడిగా పి.మహేశ్‌బాబు తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ప్రచార చిత్రాలు, టీజర్, పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని ఆదివారం మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ 'ఆంధ్రా కింగ్ తాలూకా' నేను గర్వపడే సినిమా. మనమందరం గర్వపడే సినిమా. నా కెరీర్‌లో ఇంత అందమైన సినిమా ఇచ్చిన మహేశ్‌కు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. కన్నడ నటుడు ఉపేంద్ర ఇందులో సూపర్‌స్టార్ పాత్రలో కనిపించనున్నారు. ఈనెల 28న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ్ నుని, సంగీతం: వివేక్, మెర్విన్.

## గెలుపు పాటతో మొదలు



కన్నడ హీరోలు శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి నటిస్తున్న మల్టీస్టారర్ '45 ది మూవీ'. అర్జున్ జన్య దర్శకత్వంలో ఉమా రమేశ్‌రెడ్డి, ఎం. రమేశ్‌రెడ్డి నిర్మిస్తున్నారు. డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. 'గెలుపు తలుపు దొరికేవరకూ దిగులు పడకురా' అంటూ సాగే గీతాన్ని యూనిట్ ఆదివారం విడుదల చేసింది. దర్శకుడు అర్జున్ జన్య ఈ గీతాన్ని స్వరపరిచారు. రోల్ రైడా, వినాయక్ ఆలపించారు. సినిమాటోగ్రఫీ: సత్య హెగ్డే.

## వసుదేవ సుతం



మాస్టర్ మహేందర్ ప్రధాన పాత్రలో వైకుంఠ్ బోను తెరకెకిస్తున్న చిత్రం 'వసుదేవ సుతం'. ధన లక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'వసుదేవ సుతం' అంటూ సాగే గీతాన్ని హీరో ఆకాశ్ జగన్నాథ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'పల్లెటూరి వాతావరణంలో అందర్నీ కట్టిపడేసేలా చిత్రీకరించిన ఈ పాట నాకు బాగా నచ్చింది. థియేటర్లలో సినిమా చూసే ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందనే నమ్మకం ఉంది. చిత్రం ఘనవిజయం సాధించాలి' అని కోరుకున్నారు. చైతన్య ప్రసాద్ రాసిన ఈ గీతానికి మణిశర్మ సంగీతం అందించారు.

## చాందినీ చిత్రం షురూ



చాందినీ చౌదరి ప్రధాన పాత్ర పోషిస్తున్న కొత్త చిత్రం ఆదివారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు తరుణ్ భాస్కర్ క్లాప్ ఇచ్చారు. ఈ చిత్రానికి వికాస్ దర్శకుడు. సహచారి ప్రొడక్షన్ పతాకంపై సృజన్ గోపాల్ నిర్మిస్తున్నారు. సుశాంత్ యాష్కీ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా సృజన్ గోపాల్ మాట్లాడుతూ 'సైన్స్ ఫిక్షన్ డార్క్ కామెడీ జానర్లో ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాం. ఎవరూ ఊహించని ఒక సూపర్ హీరోను పరిచయం చేస్తున్నాం' అని చెప్పారు. వికాస్ మాట్లాడుతూ 'అతీంద్రియ శక్తుల నేపథ్యంలో ఈ చిత్రం కథ సాగుతుంది. కాన్సెప్ట్ వీడియోను త్వరలో విడుదల చేస్తాం' అని చెప్పారు.

## రైతుల వెతలే కథగా...



పులివెందుల మహేశ్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'స్కూల్ లైఫ్'. సావిత్రి షన్ను కథానాయిక. గంగా భవాని నిర్మించారు. హీరో సుమన్, ఆమని, మురళీధర్ గౌడ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 14న సినిమా విడుదల కానుంది. ఇటీవలె నిర్వహించిన వేడుకలో చిత్ర దర్శకుడి తల్లిదండ్రులు ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హీరో సుమన్ మాట్లాడుతూ 'ఒక రైతు పాత్రలో రైతులకు అండగా నిలబడేలా నా క్యారెక్టర్ ఉండబోతుంది' అని తెలిపారు.


చాంపియన్ ట్రోఫీ అందుకున్న విజయనగరం జిల్లా జట్టు

## తైక్వాండో చాంపియన్ విజయనగరం జిల్లా

ఏలూరు రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శనివారపు పేట జడ్పీ హైస్కూల్ మైదానంలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించింది. అండర్-14, 17 బాల బాలికలకు పోటీలు ఆదివారం జరిగాయి. డీవైఈవో పి.రవీంద్రభారతి మాట్లాడుతూ ఆత్మరక్షణ విద్యలను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అలివేలు మంగ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలు అరుణాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. విజేతలకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రవిప్రకాష్, ఎస్జీఎఫ్ మండల కార్యదర్శి పి.పద్మలత, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.


పోటీకి సిద్ధమవుతున్న స్విమ్మర్లు

## ఉత్సాహంగా జిల్లా స్థాయి ఈత పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి ఎంపిక ఈత పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో 70 మంది బాల బాలికలు పాల్గొన్నారు. ఐదు విభాగాల్లో గ్రూపు 1 నుంచి గ్రూప్ 3 వరకు బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఐ.మల్లికార్జున్ తెలిపారు. ఎంపికైన స్విమ్మర్లు ఈనెల 22, 23 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే జూనియర్, సబ్ జూనియర్ విభాగంలో అంతర జిల్లా ఈత పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. పోటీలను స్విమ్మింగ్ కోచ్ రాజేంద్ర పర్యవేక్షించారు.


సాఫ్ట్ బాల్ జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

## సాఫ్ట్ బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీ

కామవరపుకోట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం బాలుర సీనియర్ జిల్లా జట్టు ఎంపిక పోటీ జరిగింది. 33 మంది క్రీడాకారులు పాల్గొనగా ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసినట్టు కార్యదర్శి మళ్ల ప్రతిమాదేవి, అధ్యక్షుడు మిడతా రమేష్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8, 9 తేదీల్లో గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో జరిగే సీనియర్స్ బాలుర రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆడమిల్లి, బుట్టాయగూడెం పీడీలు మానుకొండ సుబ్బారావు, తెల్లం శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సొసైటీ చైర్మన్ తాతాజీ, సభ్యుల ప్రమాణస్వీకారంలో మంత్రి నిమ్మల

## రైతులకు సొసైటీలు అండగా ఉండాలి

### మంత్రి నిమ్మల రామానాయుడు

నరసాపురం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు రైతులకు అండగా ఉండాలని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సీతారాంపురం సొసైటీ పాలకవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైసీపీ పాలనలో సొసైటీలు నిర్వీర్యం అయ్యాయన్నారు. రైతులు అమ్మిన ధాన్యానికి కూడా సకాలంలో సొమ్ము చెల్లించలేకపోయారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందన్నారు. ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ సొసైటీలు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ప్రభుత్వ మైనార్టీ సలహాదారు షరీఫ్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి, మత్స్యకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి చిన్న మాట్లాడారు. చైర్మన్ తాతాజీ, సభ్యులు శ్రీరామచంద్రుడు, మావుళ్ల ప్రమాణస్వీకారం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు బండారు మాధవనాయుడు, జానకీరామ్, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌రావు, ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, ఆర్డీవో దాసిరాజు, నెక్కంటి సుబ్బారావు, మైలా వసంతరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## అపరిచితులతో ఫోన్‌లో మాట్లాడొద్దు

### లోక్‌అదాలత్ చైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి


సదస్సులో మాట్లాడుతున్న గ్రేస్‌కుమారి

భీమడోలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు అపరిచిత ఫోన్‌కాల్‌కు స్పందించవద్దని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ప్రజా ప్రయోజనాల సేవల శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ మేరీ గ్రేస్ కుమారి సూచించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవంలో భాగంగా పోలసానపల్లిలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు అధికంగా ఉన్నాయని బాలికలు సెల్‌ఫోన్ ఉపయోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితులకు వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వరాదన్నారు. బాలల ఉన్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అందిస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాలలో లోపం ఉంటే లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలతో పాటుగా ఉచిత న్యాయ సహాయం అందించడానికి న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితులతో వెళ్లిన యువకుడు తిరిగి రాలేదు!

ఏలూరు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులతో బయటకు వెళ్లిన ఒక యువకుడు తిరిగి రాలేదని తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు తంగెళ్లమూడి గవర్నర్‌పేటకు చెందిన వీరన్న రంజిత్ కుమార్ (18) పదో తరగతి వరకూ చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. అతని స్నేహితులతో గత నెల 28వ తేదీ రాత్రి 8 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లేకపోవడంతో అతని తల్లి రామలక్ష్మి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ద్వారకాతిరుమలలో చిన వెంకన్న జల విహారం


కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం


ఆచంటలో సత్యనారాయణస్వామి, మదనగోపాలస్వామి తెప్పోత్సవం

# శ్రీహరి జల విహారం

### ద్వారకాతిరుమల, ఆచంట, కాళ్లకూరులో వైభవంగా తెప్పోత్సవం

ద్వారకాతిరుమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సుదర్శన పుష్కరిణిలో హంస వాహనంపై చిన వెంకన్న ఉభయనాంచారులతో ఆదివారం రాత్రి జల విహారం చేశారు. క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన తెప్పోత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. విద్యుద్దీపకాంతులు, కోలాట భజనలు, డప్పు వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ, బాణసంచా మోత, అర్చకుల వేదఘోషల నడుమ జరిగిన ఉత్సవం కనువిందు చేసింది. ముందుగా ఆలయంలో తొళక్కవాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, సన్నాయి డోలు వాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా శ్రీవారి వాహనం పురవీధులకు పయనమైంది. తిరువీధి సేవ అనంతరం వాహనాన్ని సుదర్శన పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. పుష్కరిణిలో హంసవాహనంగా అలంకరించిన తెప్పలో స్వామి, అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు, ట్రస్టీ ఎస్‌వి నివృతరావు, ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణ నడుమ తెప్ప పుష్కరిణిలో విహరించింది. పుష్కరిణి మధ్యనున్న మండపంలో శ్రీవారు. పద్మావతి, ఆండాళ్ అమ్మవార్ల నుంచి అర్చకులు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవ వైభవాన్ని వీక్షించారు.

### ఆచంటలో వైభవంగా తెప్పోత్సవం

ఆచంట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ఆచంటేశ్వరుని ఆలయం ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పూజలు, అభిషేకాలతో కిటకిటలాడింది. సాయంత్రం రామ గుండం చెరువులో ఆచంటేశ్వరుని సన్నిధిలోని సత్యనారాయణస్వామి, మదన గోపాలస్వామి వార్ల జల విహారం కన్నుల పండువగా జరిగింది. స్వామి వార్ల గ్రామోత్సవం అనంతరం రామగుండం చెరువు వద్ద పూజలు నిర్వహించి అలంకరించిన రెండు పడవల్లో బాణసంచా కాల్పుల నడుమ స్వామి వార్ల తెప్పోత్సవం నిర్వహించారు. ఆచంట, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ చైర్మన్ నెక్కంటి గజేశ్వరరావు, ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆచంట ఎస్‌ఐ కట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసు బందో బస్తు నిర్వహించారు.

### కాళ్లకూరులో క్షీరాబ్ది ద్వాదశి పూజలు

కాళ్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం క్షీరాబ్ది (చిలుకు) ద్వాదశి సందర్భంగా ఆదివారం రాత్రి కన్నుల పండువగా శ్రీవారికి తెప్పోత్సవం నిర్వహించారు. మేళతాళాలతో తొలుత స్వామి, అమ్మవార్లను శేష వాహనంపై పురవీధుల మీదుగా పద్మావతి పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై పూజలు నిర్వహించారు. బాణసంచా వెలుగులు, వేదమంత్రాల నడుమ గోవింద నామస్మరణతో భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ తనయుడు భరత్, పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తెప్పోత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను దేవస్థానం ఈవో ఎం.అరుణకుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.


శ్రీవారి దర్శనానికి క్యూలైన్లలో వెళుతున్న భక్తులు


గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు


మద్ది ఆలయంలో సువర్చలా హనుమద్ కల్యాణం


ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరుడు


క్షీరా రామలింగేశ్వరుడికి ప్రత్యేక అలంకరణ

## కిటకిటలాడిన చిన్న తిరుపతి

### గోవిందా.. గోవిందా..

ద్వారకాతిరుమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చిన్న వెంకన్న ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం, సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి ఆలయానికి యాత్రికుల రద్దీ నెలకొంది. దేవస్థానంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్ర వాహనాలతో నిండింది. శ్రీవారి ఉచిత దర్శనానికి 2గంటల పైబడి సమయం పట్టింది. సుమారు 12 వేల మంది వచ్చినట్లు అధికారుల అంచనా. సాయంత్రం నుంచి రద్దీ తగ్గుముఖం పట్టింది. శ్రీవారి నిత్యార్జిత కల్యాణంలో దాదాపు 125 జంటలు పాల్గొన్నారు.

### మద్దిలో సువర్చల హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం హనుమద్ హోమం అనంతరం సువర్చల హనుమద్ కల్యాణం వైభవంగా నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ఆలయ 108 ప్రదక్షిణలు, తలనీలాలు, అన్నప్రాసనలతో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వివిధ సేవల రూపంలో రూ.2.42 లక్షల ఆదాయం వచ్చిందని, నిత్యాన్నదాన సత్రంలో సుమారు 3600 మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఈవో ఆర్‌వి చందన తెలిపారు.

### గుబ్బల మంగమ్మను దర్శించుకున్న భక్తులు

బుట్టాయగూడెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీలో కొలువైన గుబ్బల మంగమ్మను ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. తుఫాను కారణంగా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసు హెచ్చరికలతో నాలుగు రోజులపాటు ఆలయ మార్గం మూసివేశారు. వాతావరణం అనుకూలించడంతో మార్గం తెరవడంతో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా కమిటీవారు ఏర్పాట్లు చేశారు.

### క్షీరారామంలో చిలుకు ద్వాదశి పూజలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ ద్వాదశిని చిలుకు ద్వాదశి, క్షీరాబ్ది ద్వాదశి అంటారు. పంచారామ క్షేత్రమైన క్షీరా రామలింగేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పంచారామ క్షేత్రాల దర్శనం పేరుతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆర్టీసీ, వివిధ వాహనాల్లో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ క్షేత్ర పాలకుడు శ్రీలక్ష్మీ జనార్దనస్వామికి ప్రత్యేక పూజలు చేసి అలకంరణలు చేశారు. సుమారు 12వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్టు అంచనా.

### ఆచంటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ఆచంట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆచంటేశ్వరుడికి ఆదివారం లక్షపత్రి పూజ పార్వతి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.


ఆచంటేశ్వరుడికి లక్షపత్రి పూజ

### సోమేశ్వరుడికి ప్రత్యేక అలంకారం

భీమవరం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గునుపూడి సోమేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు రామకృష్ణ అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈవో డి.రామకృష్ణంరాజు, చైర్మన్ చింతలపాటి బంగార్రాజు పర్యవేక్షించారు.


ద్వారకాతిరుమలలో చోరీ జరిగిన ఇంట్లో ఎస్సై సుధీర్ పరిశీలన

## వరుస చోరీలు

### ద్వారకాతిరుమలలో ఒకే రోజు మూడు ఇళ్లలో దొంగతనాలు

### 12 కాసుల బంగారు ఆభరణాలు, రూ.2.50 లక్షల నగదు, ఒక బైక్ అపహరణ

ద్వారకాతిరుమల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరుస దొంగతనాలతో ద్వారకాతిరుమల ప్రజలు హడలెత్తిపోయారు. మూడు ఇళ్లలో ఒకేరోజు దొంగతనాలు జరగడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం అర్ధరాత్రి వేళ దొంగలు రెచ్చిపోయారు. దాదాపు 12 కాసుల బంగారు ఆభరణాలు, రూ.2.50 లక్షలు నగదు అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని వ్యక్తులు గ్రామానికి చెందిన పోలుబోయిన లక్ష్మణరావు ఇంట్లో ప్రవేశించి మత్తు మందు చల్లారు. బీరువా పగలుకొట్టి దర్జాగా బంగారు నగలు దోచుకెళ్లారు. దాదాపు పది కాసుల బంగారు నగలు పోయినట్లు ఉదయం గుర్తించిన బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించారు. చెరువు వీధిలో ఉంటున్న కనిగొళ్ల లక్ష్మికాశి విశ్వనాథం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో చొరబడి రెండు కాసుల బంగారం, రూ.2.50 లక్షలు నగదు దోచుకెళ్లారు. కాశి అశ్వారావుపేటలోని తన సోదరి ఇంటికి శుభకార్యం నిమిత్తం కుటుంబ సమేతంగా వెళ్లారు. తిరిగి ఆదివారం సాయంత్రం వచ్చేసరికి ఇంటి తలుపులు తెరచి ఉండడంతో దొంగతనం జరిగిందని గుర్తించి లబోదిబోమన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రంథాలయం పక్కరోడ్డులోని పీఎంపీ వైద్యుడు నరం నరసింహరావు ఇంటి ఆవరణలో ఉంచిన పల్సర్‌బైక్ అపహరించారు. చోరీ సంఘటన సీసీ కెమెరాలో రికార్డు అయింది. వీటిపై బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఘటనా స్థలాలను పరిశీలించి కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### వినాయకుడి ఆలయంలో చోరీ


పేరుపాలెం ఆలయం వద్ద డాగ్ స్క్వాడ్ తనిఖీ

మొగల్తూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పేరుపాలెం నాలుగు రోడ్ల ప్రధాన కూడలిలో వినాయకుడి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ ప్రధాన ద్వారం గేటును గునపాలతో బద్దలుకొట్టి గుడి లోపల హుండీ దొంగిలించుకుపోయారు. పేరుపాలెం పంచాయతీ సమీపంలోని బరియల్ గ్రౌండ్ వద్ద దొంగిలించిన హుండీని గునపాలతో పొడిచి అందులో నగదు దొంగలు అపహరించినట్లు గ్రామస్థులు తెలిపారు. సమాచారం అందుకున్న మొగల్తూరు పోలీస్‌లు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లకు సమాచారం అందించడంతో ఆ రెండు బృందాలు తనఖీలు చేశాయి. అయితే వినాయకుడు ఆలయ కమిటీ నుంచి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వలేదని, ఫిర్యాదు ఇచ్చిన అనంతరం కేసు నమోదు చేస్తామని మొగల్తూరు పోలీసులు తెలిపారు.

## అంతర్ రాష్ట్ర దొంగల ముఠా దొరికింది


పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బంగారం తక్కువ ధరకు ఇస్తున్నామని నమ్మించి, తర్వాత వారిని బెదిరించి డబ్బులు దోచుకుపోయే నలుగురు అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను తాడేపల్లిగూడెం పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ ఎస్సై ఆదిప్రసాద్ ఆదివారం వివరాలు తెలిపారు. జల్సాలకు అలవాటు పడిన కర్నాటకకు చెందిన ఐదుగురు వ్యక్తులు లాడ్జీల్లో రిజిస్టర్లు పట్టుకుపోయి అందులో నంబర్లకు ఫోన్‌చేసి తక్కువ ధరకు బంగారం ఇస్తామని చెబుతున్నారు. త్వరగా డబ్బులతో వస్తే బంగారం దక్కుతుందని తొందరపెట్టి నిర్మానుష ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. అక్కడ నకిలీ బంగారం చూపుతున్నారు. బంగారం కోసం వచ్చిన వారు అసలు, నకిలీ చూడాలని అడిగితే కత్తితో బెదిరించి పరారవుతున్నారు. ఫిర్యాదులు అందడంతో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో డీఎస్పీ విశ్వనాథ్ సూచనలతో సీఐ ఆది ప్రసాద్, ఎస్సై నాగరాజు దర్యాప్తు చేపట్టారు. కర్ణాటక చిత్రదుర్గం మండలం కునటేపు గొల్లరబట్టికి చెందిన శరణప్ప గంగప్ప, సండూర్ మండలం త్రిపురకు చెందిన కార్తీక్ ఉమాపతి,ఎన్ శశికుమార్, రుద్రప్ప, గజపుర మండలానికి చెందిన బత్తినపల్లికి చెందిన సతవాడ సందీప్‌లుగా గుర్తించారు. జాతీయ రహదారిపై కారులో వెళ్తున్న ఐదుగురిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.13,500 నగదు, చాకు, కియా కారు, లాడ్జ్ పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు వేగంగా దర్యాప్తు చేసిన డీఎస్పీ విశ్వనాథ్, సీఐ ఆది ప్రసాద్, ఎస్సైలు నాగరాజు, బాదం శ్రీనును ఎస్పీ అభినందించారు.

### వరకట్న వేధింపుల కేసు నమోదు

ఏలూరు క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వరకట్నం కోసం వేధించిన భర్తపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నూకాలమ్మ గుడి ప్రాంతానికి చెందిన మారుమూడి రవికి నెదురు మల్లికతో వివాహమైంది. రవి వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. భార్య మల్లికను వరకట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధించడంతో ఆమె ఫిర్యాదు మేరకు సీఐ కె.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## భగ్గుమన్న కూరగాయల ధర

### అన్నీ కిలో రూ.60 పైనే

### వంకాయలు కిలో రూ.120

తాడేపల్లిగూడె, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. అన్ని కూరగాయల ధరలు కిలో రూ.60 పైనే ఉన్నాయి. వంకాయల ధర మరింత మండుతోంది. మొంథా తుఫాన్ ప్రభావంతో లంకప్రాంతాల్లో కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. దీనికితోడు కార్తీక మాసం కారణంగా కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రధానంగా గోదావరి పరివాహక ప్రాంతాలైన ఖండవల్లి, ఆచంట, సిద్ధాంతం, రావులపాలెం, గోపాలపురం ప్రాంతాల్లో కూరగాయలు పండించడంతో పాటు ఇతర తోటలో అంతరపంటగా సాగు చేస్తుంటారు. మెట్ట ప్రాంతాల్లో కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల, చింతలపూడి, లింగపాలెం మండలాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారు. తాడేపల్లిగూడెంలో మండలం జగ్గన్నపేట, వెంకట్రామన్నగూడెం, లింగారాయుడుగూడెంలో కూడా సాగు పెంచారు. ఇటీవల కురిసిన వర్షాలకు గాలులకు కూరగాయలు తోట పూర్తిగా ధ్వంసమైనాయి. ఉన్న తోటలకు చీడపీడలు ఆశించడంతో దిగుబడి తగ్గింది. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచేస్తున్నారు. వంకాయ ధర కిలో రూ.120 చేరిందంటే పరిస్థితి అర్థమవుతోంది. బీరకాయలు రూ.80, చిక్కుడు రూ.120, క్యారెట్ రూ.70, బీట్‌రూట్ రూ.90, కాకరకాయ రూ.60, ఆకాకరకాయ రూ.140, చిలకడ దుంపలు రూ.80, క్యాప్సికం రూ.120, దోసకాయ రూ.60, బెండకాయలు రూ.80, దొండకాయలు రూ.60, కంద రూ.70, అల్లం మంచి రకం రూ.100 నుంచి 120 మధ్య అమ్మారు. అరటికాయలు జత రూ.20, మునగకాడ జత రూ.30 వంతున విక్రయిసున్నారు.

### మహారాష్ట్ర ఉల్లికి డిమాండ్



మార్కెట్లో మహారాష్ట్ర ఉల్లికి డిమాండ్ తగ్గలేదు. ఆదివారం మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి 10 లారీల్లో 290 టన్నుల ఉల్లి వచ్చింది. హోల్‌సేల్‌గా క్వింటా రూ.1800 నుంచి 2300 ధరకు విక్రయించారు. కర్నూలు నుంచి 4 లారీల్లో 60టన్నుల ఉల్లి వచ్చింది. క్వింటా రూ.1000 నుంచి 1300 మధ్య విక్రయించారు. ఇక రిటైల్‌గా నాసిరకం ఉల్లి రూ.100కు 6కిల వంతున అమ్మకాలు జరిగాయి. మంచి రకం ఉల్లి 4 కిలోలు రూ.100, మధ్య రకం ఉల్లి 5 కిలోలు రూ.100 చొప్పున విక్రయించారు.

## 11 మంది సీనియర్ సిటిజన్స్‌కు ఉచిత వైద్య సేవలు

తణుకు, నవంబరు2(ఆంధ్రజ్యోతి):సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించే సంచార శకటం ద్వారా ఇంటింటికి వెళ్లి వృద్ధులకు వైద్య సేవలు ఆదివారం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు హసేన్ అహ్మద్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తణుకులోని పలు ప్రాంతాల్లో పర్యటించి 11మందికి వైద్య సేవలందించారు. సంఘ సభ్యులు ఆకుల వెంకటేశ్వరరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందించారు. కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరజాల నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యాన వర్సిటీలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమం

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి):జాగ్రత్త అనేది మన ఉమ్మడి బాధ్యతగా అంతా కలిసికట్టుగా విధులను నిర్వర్తించాలని రూరల్ సీఐ బి.భీమేశ్వరరవికుమార్ పేర్కొన్నారు. వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆవరణలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమం ఆదివారం ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. తొలుత విజిలెన్స్ విధులపై ప్రతిజ్ఞ చేయించారు. రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, డీన్, విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో ఎర్రన్నాయుడు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి, వలవల బాబ్జి, తదితరులు

## ఎర్రన్నాయుడు సేవలు మరువలేనివి

తాడేపల్లిగూడెం అర్బన్/గణపవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : కేంద్ర మాజీ మంత్రి ఎర్రన్నాయుడు సేవలు మరువలేనివని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఎర్రన్నాయుడు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం పట్టణంలోని పోలీస్ ఐలాండ్ వద్ద ఉన్న విగ్రహానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, భవన కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్‌చౌదరి, ముత్యాల సత్యనారాయణ, పద్మనాభుని మురళి, సబ్బీను కృష్ణమోహన్ పాల్గొన్నారు. గణపవరం మండలం మల్లపురాజుపేటలో ఎర్రన్నాయుడు వర్ధంతిని టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ల సుబ్బారావు ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ డైరెక్టర్ యాళ్ల కల్యాణి, సినిగి శ్రీను, బర్ల కన్నారావు, యాళ్ల శ్రీనివాస్, సిరిగి రంగబాబు తదితరులు పాల్గొన్నారు.



మెమొంటోలు అందజేస్తున్న ఆర్‌సీడీఎస్ నాయకులు

## 'రెడ్డి కమ్యూనిటీని బలోపేతం చేయాలి'

పెంటపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : రెడ్డి కమ్యూనిటీ బలోపేతం కోసం రెడ్డి కులస్థులందరూ ఐక్యంగా ఉండాలని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ(ఆర్‌సీడీఎస్) జిల్లా అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం పెంటపాడు వాసవీ కల్యాణ మండపంలో ఆర్‌సీడీఎస్ ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి విజయ్‌ఆనందరెడ్డి మాట్లాడుతూ రెడ్డి కులస్థులందరూ రాజకీయంగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా నాయకులుగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని సత్కరించారు. అనంతరం వనసమారాధన నిర్వహించారు జిల్లా మహిళా అధ్యక్షురాలు పోతంశెట్టి లక్ష్మి, జిల్లా కార్యదర్శి కర్రి సురేష్‌రెడ్డి, వెలగల లింగారెడ్డి, గొలుగూరి శేషారెడ్డి, లక్ష్మణరెడ్డి, వరప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తాడేపల్లిగూడెంలో రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్

తాడేపల్లిగూడెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెంలో మాస్టర్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ ఆదివారం స్థానిక గుణ్ణం గోపాల్ ఫంక్షన్ హాల్లో వాసవీ క్లబ్ సహకారంతో పోటీలు జరిగాయి. ఆదివారం జనసేన యువ నాయకుడు బొలిశెట్టి రాజేష్ మొదటి ఎత్తు వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఏపీ చెస్ అసోసియేషన్ అడ్వైజర్ కవీవీ శర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫణికుమార్, మాస్టర్ చెస్ డైరెక్టర్ ఎస్ చంద్రశేఖర్ పర్యవేక్షించారు. ఈ పోటీల్లో పలు జిల్లాల 226 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఓపెన్‌లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విజేతలు, పలు వయస్సులకు సంబంధించి కేటగిరీల్లో మొదటి రెండు స్థానాలు సాధించిన విజేతలు విజయవాడలో ఈనెల 22 నుంచి 24వ తేది వరకు జరిగే ఆలిండియా 1800 రేటింగ్‌లో పాల్గొంటారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి అనిల్‌కుమార్, కార్యదర్శి పవన్, గుప్తా, బ్లూమ్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, బీజేపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గం కన్వీనర్ ఈతకోట తాతాజీ తదితరులు ఉన్నారు.

## మకర పీఠానికి 208 గ్రాముల వెండి అందజేత



వెండిని అందిస్తున్న దాతలు

భీమవరంటౌన్,నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మెంటేవారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారికి వెండి మకర పీఠానికి ఆదివారం దాతలు 208 గ్రాముల వెండి విరాళంగా అందిం చారు. పట్టణానికి చెందిన గణేషుల ఆనంద్ ఉమాదేవి దంపతులు 108 గ్రాముల వెండి, అల్లూరి కృష్ణ చైతన్య వర్మ 100 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి దాతలకు ఆశీర్వచనాలు అందించి సత్కరించారు. వెండి పీఠానికి దాతలందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## క్యూలైన్లపై ప్రత్యేక దృష్టి పెట్టండి : కమిషనర్

భీమవరంటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళంలోని కాశీబుగ్గలో జరిగిన ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని కార్తీమాసం సందర్భంగా సోమవారాలు, కార్తీక పౌర్ణమి రోజున ఆలయాల్లో ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్‌లను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ కె.రమామోహన్‌రావు ఆదేశాలు జారీ చేశారు. క్యూలైన్‌లను పర్యవేక్షించడంతో పాటు అవసరమైతే వలంటీర్లను నియమించుకుని తొక్కిసలాట జరగకుండా భక్తులు ప్రశాంతంగా స్వామివారి దర్శనం జరిగేలా చూడాలని ఆదేశించారని అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాశ్ తెలిపారు. సోమేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తీక సోమవారల్లో పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిగా అంతర్వేది నరసింహస్వామి దేవస్థానం ఈవో ప్రసాదరావును నియమించారని తెలిపారు.

## భీమవరంలో పడి పూజలు

భీమవరంటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భీమవరం సుంకర పద్దయ్య వీధిలోని అభయ అంజనేయ స్వామి దేవస్థానం వద్ద ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ భజన నిర్వహించారు. చోడిపల్లి నూకరాజు, నళిని దంపతులు, చోడిపల్లి బ్రదర్స్‌చే పూజ కార్యక్రమాలను నిర్వహించారు. సుమారు 25 అడుగుల ప్రత్యేక మండపంలో అయ్యప్ప స్వామికి అలంకరణ చేసి పడిపూజ భజన నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పడిపూజ భజన కార్యక్రమంలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. భీమవరం 4వ వార్డు కళాభవన్ వీధిలో ఆదివారం రాత్రి మావుళ్ళమ్మ అమ్మవారి మహా పడి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు పడిపూజలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## ఉండిలో టీవీ పేలి మంటలు

ఉండి, అక్టోబరు2(ఆంధ్రజ్యోతి):ఉండి ఒకటో వార్డుకు చెందిన ఓ మేస్త్రి ఇంట్లో టీవీ పేలి మంటలు వ్యాపించి ప్రమాదం సంభవించింది. బాధితుడు, సర్పంచ్ భర్త సూరవరపు వెంకటాచార్యులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన మేస్త్రి ఇంట్లో టీవీ పెడుతుండగా పేలిపోయి మంటలు వ్యాపించి పెద్ద శబ్దంతో ఇళ్లంతా పొగ కమ్మేసింది. ఈ ఘటనతో భయభ్రాంతులతో ఇంట్లో నుంచి బయటకు కుటుంబసభ్యులతో కలిసి వచ్చేశారు. కొద్దిసేపటి తరువాత ఇంట్లోకి వెళ్లగా దుస్తులు, ఇంట్లో విలువైన సామగ్రి, కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ భర్త వెంకటాచార్యులు ఆ ప్రాంతానికి విచ్చేసి పరిశీలించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించి మాట్లాడారు. ఆ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఉంటుందని అంటున్నారు. ఆ ప్రాంత లైన్‌మన్ విద్యుత్ వైర్లను పరిశీలించారు. సుమారుగా రూ.40 వేలు వరకు ఆస్తి నష్టం జరిగి వుంటుందని స్థానికులు చెబుతున్నారు.

# నిస్వార్థంగా పనిచేస్తున్నా..

» మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు



లక్ష్మీపాలెంలో మత్స్యకార కుటుంబాలకు నిత్యావసరాలు అందిస్తున్న మంత్రి నిమ్మల..



తణుకులో అధికారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

యలమంచిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు నియోజకవర్గంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నా కుటుంబ సభ్యుల రుణం తీర్చుకునేలా అభివృద్ధి, సంక్షేమాన్ని అందించేందుకు రోజుకు 18 గంటల పాటు నిస్వార్థంగా పనిచేస్తున్నానని రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మొంథా ప్రభావంతో నష్టపోయిన లక్ష్మీపాలెం, గంగడపాలెం గ్రామాల్లో మత్స్యకార కుటుంబాలకు తుఫాన్ సాయంగా 50 కిలోల బియ్యం, నిత్యావసరాలను ఆదివారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసి, 20 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లాడని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, తహసీల్దారు జి.పవన్‌కుమార్, ఎన్డీఏ కూటమి నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, ఎ.రామశ్రీనివాస్, కడలి గోపాలరావు, పాలపర్తి మాధవరావు, చిలుకూరి బాలాజీ పాల్గొన్నారు.

### చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి : నిమ్మల

పోడూరు : నాడు దివంగత ఎన్టీఆర్ చేనేత కార్మికులను గుర్తించి వారి అభివృద్ధికి కృషి చేశారని, అప్పటి నుంచీ టీడీపీ హయాంలో చంద్రబాబు చేనేత కార్మికులను గుర్తించి వారి సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేస్తున్నారని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పోడూరు మండలం రావిపాడులో ఆదివారం రాత్రి తుఫాన్ సాయం కింద 120 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు కిలో చొప్పున పంచదార, కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు, బంగాళాదుంపలను పంపిణీ చేశారు. సర్పంచ్ పెన్మెత్స విజయలక్ష్మి, పాలకొల్లు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పెన్మెత్స రామ భద్రరాజు, నియోజకవర్గ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గొట్టుముక్కల సూర్యనారాయ ణరాజు, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి పద్మారావు, ఎంపీటీసీ విప్పర్తి శారద, ఉప సర్పంచ్ కడలి శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ కడలి ఆంజనే యులు, శీలం వాసు, పితాని వెంకట్, తహసీ ల్దార్ ఎస్.ఎం.ఫాజిల్, తదితరులు పాల్గొన్నారు,

### తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాం : ఆరిమిల్లి

తణుకు :అధికారులు, కూటమి నాయకులు సమన్వయంతో పనిచేయడం ద్వారా కొంతమేర తుఫాన్ ప్రభావాన్ని నియోజకవర్గంలో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో పట్టణంలో తుఫాన్ ప్రభావానికి గురైన బాధితులకు 25 కేజీలు బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ చేశారు. తుఫాన్ సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయిన వెంటనే పునరుద్ధరణ చేసి అధికారులు సహకరించిన నేపథ్యంలో ఆయా శాఖల అధికారులను సత్కరించారు. తుఫాన్ వల్ల ప్రాథమికంగా నాలుగు వేల ఎకరాల్లో పంట నష్టం ఏర్పడిందని అధికారులు నివేది కలు అందించారన్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

### కాశీబుగ్గ ఘటన కలచివేసింది..

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన ఎంతగానో కలిచి వేసిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు.







పెనుగొండ వన సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని.. కుప్పనపూడిలో వనసమారాధన.. ఆచంటలో శెట్టిబలిజ వర్తక సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన

# ఐక్యత చాటుతున్న వనసమారాధనలు

» ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

పెనుగొండ/ఆచంట, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కార్తీక వన సమారాధనలు ఐక్యతను చాటుతున్నాయని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం పెనుగొండ ఏఎంసీ కార్యాలయంలో తాండ్ర పాపారాయ వెలమ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆచంట మండలం కొడమంచిలిలో కాపు సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. మరోవైపు ఆచంట శెట్టిబలిజ వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆచంట ఏఎంసీ ఆవరణలో కార్తీక వన సమారాదన నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కుడిపూడి శ్రీనివాస్ అధ్యక్షతన సభకు ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, తణుకు మాజీ మునిసిపల్ చైర్మన్ దొమ్మేటి సుధాకర్, బీసీ నాయకులు గుబ్బల ప్రసాద్ పాల్గొన్నారు.

● ఆకివీడురూరల్/కాళ్ల:ఆకివీడు మండలం కుప్పనపూడి కొప్పేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కార్తీక వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సుమారు మూడు వేలు మంది అన్నసమారాధనలో పాల్గొన్నారు. నూకల రాందాసు, బండి కొండ, దాసరి సత్యనారాయణ, నంద్యాల శివన్నారాయణ, నంద్యాల చిన్న, దేవస్థానం చైర్మన్ యాళాల నాని, నూకల అంతర్వేది పాల్గొన్నారు. కాళ్ల మండలం ప్రాతాళ్ళమెరకలో వున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఉసిరిచెట్టుకు పూజలు నిర్వహించి, పలురకాల పిండి వంటలతో స్వామి, అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులు, దాతల సహకారంతో నిర్వహించిన కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు విచ్చేసి వనసమారాధనలో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ కంతేటి శ్రీనివాసరాజు, ఉప సర్పంచ్ సుబ్బరాజు, వేగేశ్న బాలగణపతి వర్మ పాల్గొన్నారు.

● పాలకొల్లు అర్బన్:పాలకొల్లు ఏఎంసీ ఆవరణలో ఆదివారం గౌడ సేన అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన వేడుకగా జరిగింది. ఉసిరి చెట్టు పూజ, కార్తీక దామోదరుని పూజలు నిర్వహించారు. మహిళలు చిన్నారులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సంఘ నాయకులు చిన్నిముంతల సుబ్రహ్మణ్యం, జోగి వెంకటేశ్వరరావు, చినమిల్లి గణపతిరావు, వెలగట్ల రమేష్, డాక్టర్ కాసాని కేశవరావు చినమిల్లి బాబి, ప్రసాద్, మిద్దే పాండురంగా రావు, రేలంగి నరసింహమూర్తి, తొంటా వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ కోడి విజయ భాస్కరరావు విచ్చేసి గౌడ సంఘ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

● గణపవరం :హిందూ హైందవ సంస్కృతి, సంప్రదాయాలకు కార్తీకమాస వనభోజనాలు దోహదపడతాయని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం గణపవరం మండలం పిప్పర శివాలయం వద్ద ఆధ్యాత్మికవేత్త కొలనువాడ సుబ్బరాజు ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ దండు వెంకట్రామరాజు మాట్లాడారు. నృత్యపోటీలు, ఆధ్యాత్మిక గీతాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ సర్పంచ్ సీతామహాలక్ష్మి, ఉపసర్పంచ్ ఐవీ.రాజు, వైసీపీ నాయకులు దండు రాము, దండు గోపి, తదితరులు పాల్గొన్నారు.

● భీమవరంటౌన్ : భీమవరంలోని చింతలపాటి రామకృష్ణంరాజుతోటలో ఆదివారం సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. చిన్నారులకు ఆటల పోటీలు, నిర్వహించి బహుమతులు అందించారు. కొడాలి రమేష్, సబ్బిన శ్రీనివాస్, బొల్లెంపల్లి సంజయ్‌కుమార్, అబ్బూరి శ్రీనివాస్, గొడవర్తి మురళీకృష్ణ మునగాల సత్యనారాయణ, మురళీ పాల్గొన్నారు.







పాలకొల్లు గౌడసేన వనసమారాధనలో విజేతలకు బహుమతులు అందజేత.. పిప్పరలో ఉసిరి చెట్టు వద్ద పూజలు.. ప్రాతాళ్లమెరకలో వన సమారాధన దృశ్యం

## మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

పాలకొల్లు అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత అని ఎన్‌జీవో రిసోర్స్ పర్సన్ ప్రజ్వాల్ అన్నారు. స్థానిక బీఆర్ఎంవీఎం హైస్కూల్లో ఆదివారం విద్యాశాఖ ఆదేశాలమేరకు ఉపాధ్యాయులకు 'పిల్లల రక్షణ, మానవ అక్రమ రవాణా నిర్మూలన' అనే అంశాలపై ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏదైనా ప్రమాదాలను గమనిస్తే పిల్లలు తక్షణం 1098, 100, 181, 1930 వంటి టోల్ ఫ్రీ నంబర్లను ఉపయోగించే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. బీఆర్ఎంవీఎం హైస్కూల్, బీవీఆర్ గరల్స్ హైస్కూల్ హెచ్ఎంలు ఝాన్సీలక్ష్మీభాయ్, వైప్రభాకరశాస్త్రి, రాయపూడి భవానీ ప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జోగి రమేష్ అరెస్ట్ అక్రమం : కారుమూరి

తణుకు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జోగి రమేష్‌ను కల్తీ మద్యం కేసులో అక్రమంగా అరెస్ట్ చేశారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం తణుకు వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 16 నెలలైనా పాలనను గాలికొదిలేసి, రెడ్ బుక్ అమలు చేయడానికే యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. పార్టీ నాయకులు సాయిబాబారెడ్డి, శేషగిరి, కనకదుర్గ, మెహర్ అన్సారీ, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాలి : కేంద్రమంత్రి వర్మ



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి వర్మ

భీమవరం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) :పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయని, రాజకీయాలకతీతంగా రైతుల ప్రయోజనాల కాపాడటమే లక్ష్యంగా సహకార సంఘాలు పని చేయాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. భీమవరం మండలం కొమరాడ- గొర్లమూడి విశాల సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా రాట్నాల సత్యనారాయణ, డైరెక్టర్లుగా మల్లుల పరమేశ్వరరావు, వర్రె గణేష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీలో చాలాకాలం నుంచి పనిచేస్తున్న రాట్నాల సత్యనారాయణకు విశాల సహకార పరపతి సంఘం చైర్మన్‌గా పదవి ఇవ్వడానికి తాను అడిగిన వెంటనే సహకరించిన జనసేన, టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, సకాలంలో రుణాలు మంజూరు చేయాలని, తన వంతు సహకారం అందిస్తానన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కలిదిండి వినోద్‌వర్మ, తోట గంగరాజు, కోళ్ళ నాగేశ్వరరావు, బండి రమేష్, కోళ్ళ రామచంద్రరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం

### భద్రకాళీ సమేత వీర భద్రస్వామి కల్యాణం





ఆకివీడులో జలాభిషేకం చేస్తున్న మహిళలు.. భీమవరంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ

ఆకివీడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భక్తులు కోరిన కోర్కెలు తీర్చేది వీరభద్రుడు. కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ సహిత భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ 15 వార్షికోత్సవ కల్యాణం స్థానిక సాలిపేట దేవాలయ ప్రాంగణంలో ఆదివారం జరిగింది. ఉదయం స్వామికి అభిషేకం, మహిళలు కాలువలో స్నానమాచరించి తీసుకొచ్చిన 108 బిందెల గంగాజలంలో పాలు, పెరుగు, నెయ్యి, తేనే, పంచదార, చెరుకు, ద్రాక్షరసం, కస్తూరి, సెంటు, పన్నీరు, గంధం, విభూది కలిపి భద్రకాళీ సమేత వీర భద్రస్వామికి మహిళలు జలాభిషేకం చేశారు. సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కల్యాణానికి పీటలపై కూర్చున్న సిద్ధాని శ్రీనివాస్-మహేశ్వరి దంపతులతో అర్చకులు స్వామి కల్యాణం చేయించారు. రాత్రి స్వామి ప్రభ ఊరేగింపు, శూలాల సంబరం జరిపారు. ఉత్సవ కమిటీ శ్రేణులు ఉన్నారు.

● నరసాపురం రూరల్: ఎల్‌బీచర్ల గ్రామంలో ఆదివారం గంగాలమ్మ వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు రకాల పువ్వులతో అమ్మవారికి అలంకరణ చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

● కాళ్ల : మాలవానితిప్ప గ్రామంలో కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సర్పంచ్ సాగిరాజు సుబ్బరాజు దంపతులు శనివారం రాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి కార్తీక దీపోత్సవం ప్రారంభించారు.

● తాడేపల్లిగూడెం రూరల్ : వీరంపాలెం శ్రీ బాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రంలో కార్తీక మాసం పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో మువ్వగోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్ర మాలను ఆలయ వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణ సిద్ధాంతి పర్యవేక్షించారు.

● భీమవరంటౌన్ : భీమవరం గునుపూడిలో ఉన్న సోమేశ్వర జనార్దన స్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరఫున లంకలకోడేరుకు చెందిన వెంకటసాయి రైస్ మిల్లు యజమాని ఆర్జంపూడి బాబురావు, వెంకటలక్ష్మిలీలావతి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజు, కార్యదర్శి కొత్త శ్రీనివాస్ ప్రారంభించారు.

## మావుళ్లమ్మ నిత్యాన్న దానానికి రూ.50 వేలు విరాళం

భీమవరంటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ దేవస్థానంలో ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదానం పథకానికి చిన అమిరానికి చెందిన సింగంశెట్టి వెంకట చైతన్య, లక్ష్మి దంపతులు రూ.50 వేలు విరాళం అందించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు చేసి ఆశీర్వచానాలు అందించారు. దేవస్థానం తరపున దాతకు ప్రసాదాన్ని, ఆలయ ఈవో మహాలక్ష్మినగేష్ అందించారు.

## గీత వృత్తి రక్షణకు అఖిల పక్షం మద్దతు

తణుకు, నవంబరు2(ఆంధ్రజ్యోతి) : గీత వృత్తి రక్షణ బాటకు అఖిల పక్షం మద్దతు ఇస్తుందని పలువురు అఖిల పక్షం నాయకులు అన్నారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో కల్లుగీత కార్మిక జిల్లా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గీత వృత్తి కాపాడుకోవడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ గీత వృత్తిలో కార్మికుల సమస్యలను తెలిపారు. కూటమి ప్రభుత్వం గీత కార్మికుల పట్ల వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, మారిశెట్టి శేషగిరి, బొద్దాని నాగరాజు, వెలగల సాయిబాబారెడ్డి, పీవీ ప్రతాప్ మాట్లాడారు. సమావేశంలో పలువురు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెనుమంట్ర పంచాయతీ కార్యదర్శి రామారావు మృతి

పెనుమంట్ర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పెనుమంట్ర పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి మంచిరాజు సీతారామారావు (57) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. ఖండవల్లి గ్రామానికి చెందిన ఆయన 30 ఏళ్ల నుంచి పంచాయతీ రాజ్ సర్వీసులో ఉన్నారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మండలానికి పూర్తి స్థాయి ఈవోపీఆర్డీ పోస్టు ఖాళీగా ఉన్న కాలంలో ఆయన కొన్ని నెలలు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన భౌతిక ఖాయం వద్ద స్థానిక పంచాయతీ సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ప్రసన్నకుమార్, ఆచంట, పెంటపాడు ఎంపీడీవోలు కృష్ణమోహన్, రామ్‌ప్రసాద్, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, గ్రామ కార్యదర్శులు పలువురు నివాళులర్పించారు.

## సీపీఎం నేత సత్యనారాయణ సేవలు మరువలేనివి

పాలకొల్లు అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకుడు కండిబోయిన సత్యనారాయణ మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం నాయకులు అన్నారు. అరట్లకట్ట గ్రామానికి చెందిన సత్యనారాయణ(74) అనారోగ్యంతో మరణించారు. గ్రామంలో ఆదివారం సంతాప సభ నిర్వహించారు. మండల కమిటీ కన్వీనర్ జవ్వాది శ్రీనివాస్, యర్రా అజయ్‌కుమార్, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి, కండిబోయిన రామకృష్ణ, లక్ష్మణరావు, ఎం.రామారావు తదితరులు సంతాప సభలో పాల్గొన్నారు.

## బయటకొస్తున్న లిక్కర్‌దొంగలు

తణుకు, నవంబరు2(ఆంధ్రజ్యోతి) : లిక్కర్ కుంభకోణంలో మరికొంత మంది గజదొంగలు బయటకు వస్తున్నారని ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జోగి రమేష్ అరెస్టు పట్ల మాజీ మంత్రి కారుమూరి మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నారని కారుమూరి వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కుంభకోణంలో మరింతమంది గజదొంగలు జైలుకు వెళ్లడం ఖాయమని చెప్పారు. త్వరలోనే కారుమూరి సైతం జైలుకు వెళతారని పేర్కొన్నారు.

## మహిళకు సాయం

పాలకొల్లు అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 28వ వార్డుకు చెందిన ముత్యాల మహాలక్ష్మికి మూడు నెలలకు సరిపడా మందులను అందజేశారు. ఆమె గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు, పొట్నూరి ఫౌండేషన్ చైర్మన్ పొట్నూరి అప్పన్న మూడు నెలలకు సరిపడా మందులను ఆదివారం ఆమె నివాసంలో అందజేశారు.



## శబరిమలైకు సైకిల్ యాత్ర

నరసాపురం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నరసాపురం మీదుగా ఆదివారం పాల కొల్లుకు చెందిన అయ్యప్పస్వాములు కన్నా రవికిరణ్, గంట దుర్గ శబరిమలైకు సైకిల్‌పై బయలుదేరారు. తొలిసారిగా వీరిద్దరూ మాల వేసుకుని సుమారు 1,300 కిలోమీటర్ల సైకి ల్‌పై వెళ్లనున్నారు. నరసాపురం సెంటర్‌లో ఈ ఇద్దరి భక్తులకు స్వాములు స్వాగతం పలి కారు. 15 రోజుల పాటు సాగే ఈయాత్రలో అనేక క్షేత్రాలను సందర్శించుకుని స్వామి కొండకు వెళతామని రవికిరణ్, దుర్గ చెప్పారు.